నేడు జిల్లాలో నీతిఅయోగ్ బృందం పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

నీతి అయోగ్ బృందం గురువారం జిల్లాలో పర్యటించనుంది. ఉదయం 11.30 గంటలకు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురంలో పర్యటిస్తారు. రైతులతో మాట్లాడతారు. ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య స్వయం సహాయక బృందాలతో మాట్లాడుతారు. భోజన విరామం అనంతరం జిల్లాలో పంట, పైరు, ఫలసాయం పంటలు మరియు సాంప్రదాయాల పంటల స్థితిస్థాపకత ఛాయాచిత్ర ప్రదర్శన, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, జిఐజెడ్ తో కేర్ పరిశోధనా ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటి వరకు సాధించిన లక్ష్యాలు, ఫలితాలపై వట్లూరు టిటిడిసిలో మధ్యాహ్నం 3.15 గంటల నుంచి 4.30 గంటల వరకు రైతులతో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు.

పోటీనా.. ఏకపక్షమా..!

16 సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తికి సన్నాహాలు

చేతులెత్తే విధానంలో ఎన్నికపై రైతుల్లో అసంతృప్తి

గతంలో పోటీ లేకుండా.. ఏకపక్షంగా నిర్వహించారనే విమర్శలు

ఉమ్మడి 'పశ్చిమ'లో మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిసిలు, ఒక ప్రాజెక్టు కమిటీ

మైనర్ ఇరిగేషన్‌లో 222 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, రెండు ప్రాజెక్టు కమిటీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తారా.. లేక ఏకపక్షంగా సాగించి ముందుగా అనుకున్నవారినే నియమిస్తారా.. అనే అనుమానాలు నెలకొన్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ రైతుల్లో పెద్దఎత్తున విన్పిస్తోంది. ఈ నెల 16వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 40 రోజుల్లో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు చెప్పింది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగడం మంచి పరిణామంగా చెప్పొచ్చు. ఎన్నికల నిర్వహణ తీరుపై మాత్రం రైతుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగిన తీరును అంతా గుర్తు చేసుకుంటున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను మూడు పద్ధతుల్లో నిర్వహిస్తారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలు మూడు విభాగాలుగా ఎన్నికల నిర్వహణ సాగుతోంది. వాటర్ యూజర్స్ అసోసియేషన్లలో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, నలుగురు సభ్యులు ఉంటారు. వీరిని ఆయకట్టు రైతులు ఎన్నుకొంటారు. ఈ కమిటీల సభ్యులు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి గోదావరి డెల్టా పరిధిలోని మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 222 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు లేవు. మేజర్ ఇరిగేషన్ అంతా డెల్టా పరిధిలో ఉండగా, మైనర్ ఇరిగేషన్ అంతా మెట్ట ప్రాంతంలో ఉంది. మెట్టప్రాంతంలోని తమ్మిలేరు, ఎర్రకాలువకు రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. విభజిత జిల్లాల ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతాయని చెబుతుండటంతో కమిటీల లెక్కలు మారే అవకాశం ఉంది.

ఎన్నికల నిర్వహణపై చర్చ

సాగునీటి సంఘాలకు సంబంధించి వాటర్ యూజర్స్ అసోషియేషన్ కమిటీలోని సభ్యులను ఆయకట్టు పరిధిలోని రైతులు ఎన్నుకుంటారు. ఈఎన్నికల్లో బ్యాలెట్ పద్ధతి లేకుండా చేశారు. 2015లో జరిగిన ఎన్నికల్లో గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి చేతులెత్తే విధానంలో ఎన్నికల నిర్వహించారు. అప్పట్లో పోటీ అనేది లేకుండా చేశారు.ఎక్కడైన పోటీగా అభ్యర్థి ఉంటే అక్కడ ఎన్నికలు జరపకుండా వాయిదా వేసి, అడ్డదారిలో ఎన్నికలు నిర్వహించారన్న తీవ్ర విమర్శలను అప్పట్లో ప్రభుత్వం మూటగట్టుకుంది. అధికార పార్టీ నాయకులు ముందుగా అనుకున్న సభ్యులనే సాగునీటి సంఘాల ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆయకట్టు పరిధిలోని పైన పొలం ఉన్న రైతులను ప్రెసిడెంట్‌గా ఎన్నుకొంటే దిగువన పొలం ఉన్నవారిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. ఒకవేళ దిగువన పొలం ఉన్నవారికి ప్రెసిడెంట్ ఇస్తే.. పైన పొలం వారికి వైస్ ప్రెసిడెంట్ ఇస్తారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని సాగునీటి సంఘాలకు అనధికారికంగా టిడిపి, జనసేన నాయకులను నియమించిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో వీరినే ప్రకటించి మమ అనిపించే అవకాశం కనిపిస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా, ఏకపక్షంగా నిర్వహించడం వల్ల ఉపయోగం ఏమిటనే చర్చ రైతుల్లో నడుస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని అంతా కోరుతున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్నికలు జరిపినా నిధులివ్వకపోతే ప్రయోజనం శూన్యం

సాగునీటి సంఘాలకు 2015లో ఎన్నికలు నిర్వహించినప్పటికీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో సాగునీటి సంఘాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. నిబంధనల ప్రకారం రైతులు నీటి తీరువా కింద చెల్లించే సొమ్ములో 60 శాతం వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు, స్థానిక పంచాయతీలకు ఐదు శాతం, ఇతర కమిటీలకు నిధులు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నిధులతో కాలువల్లో చెత్త వంటివి తొలగించడంతోపాటు రైతులకు ఉపయోగపడే పనులను సాగునీటి సంఘాల ప్రతినిధులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండాపోతుంది. ఈసారైనా సాగునీటి సంఘాలకు నిధులు విడుదల చేసి, రైతులకు మేలు చేసేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

పందెం పుంజును ఈత కొట్టిస్తూ..!

పోలవరం కాల్వలో నీటమునిగి తండ్రి, ఇద్దరు కుమారులు దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్, దెందులూరు

తండ్రీకొడుకుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

కోడిపుంజుకు ఈత శిక్షణ ముగ్గురి ప్రాణాలను బలి తీసుకుంది. పందేనికి సిద్ధం చేసే శిక్షణలో భాగంగా కోడి పుంజును నీటిలో ఈత కొట్టించడానికి ఇంటి పక్కనే ఉన్న పోలవరం కాలువలోకి దిగిన అన్నదమ్ములు ప్రమాదవశాత్తు నీట మునగ్గా, వారిని కాపాడబోయిన తండ్రి కూడా అదే కాలువలో పడి మృతి చెందాడు. దీనికి సంబంధించి పెదవేగి సిఐ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం కవ్వగుంట తోటల్లో శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తన భార్య దేవి, ఇద్దరు కుమారులు మణికంఠ, సాయికుమార్‌తో కలిసి ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నాడు. వెంకటేశ్వరరావు కోడిపుంజుల పెంపకం చేస్తుంటాడు. పుంజులను పెంచి పందేల సమయంలో విక్రయిస్తుంటాడు. దీనిలో భాగంగా వెంకటేశ్వరరావు కుమారులు మణికంఠ, సాయికుమార్ బుధవారం ఉదయం కోడిపుంజులను పక్కనే ఉన్న పోలవరం కాలువలోకి తీసుకెళ్లి ఈత కొట్టిస్తున్నారు. తమ్ముడు సాయికుమార్ తాడు పట్టుకుని కాల్వ ఒడ్డున ఉండగా, అన్న మణికంఠ ఒక చేత్తో తాడును, మరో చేత్తో కోడిపుంజును పట్టుకుని కాలువలోకి దిగి కోడిపుంజును ఈత కొట్టిస్తున్నాడు. ఈ క్రమంలో మణికంఠ కాలువలో పడిపోగా గట్టుపై ఉన్న సాయికుమార్ కాలువలోకి దిగి అన్నను లాగే ప్రయత్నం చేశాడు. ఈ ఘటనలో ఇరువురు నీట మునిగారు. ఇది గమనించిన తండ్రి వెంకటేశ్వరరావు కాలువలోకి దిగి కుమారులను రక్షించే ప్రయత్నంలో నీట మునిగాడు. అప్పుడే అటుగా వచ్చిన వెంకటేశ్వరరావు భార్య దేవి నీటిలో మునుగుతూ తేలుతున్న భర్త, కుమారులను గమనించి కేకలు వేయడంతో సమీపంలో పొలాల్లో ఉన్న రైతులు వచ్చి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అతి కష్టంపై వెంకటేశ్వరరావు (45), పెద్ద కుమారుడు మణికంఠ (15)ను కాల్వలో నుంచి ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే ఆ ఇద్దరు మృతి చెందారు. సాయికుమార్ గలంతయ్యాడు. ఏలూరు అగ్నిమాపక సిబ్బంది కాలువలో గాలించి సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పెదవేగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయికుమార్ మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

మాజీ ఎంఎల్‌సిలను కలిసిన పిడిఎఫ్ అభ్యర్థి

ప్రజాశక్తి - పాలకొల్లు

మాజీ ఎంఎల్‌సి అంగరతో గోపీమూర్తి, నేతలు

గోదావరి జిల్లాల పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి బుధవారం స్థానికంగా ఉన్న మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్‌రావు, మేకా శేషుబాబులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి సహాయ సహకారాలు, మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, నేతలు ఎస్.రాంజీకుమార్, కె.త్రినాథ్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

14 నుంచి 'పల్లె పండుగ'కు ప్రణాళిక సిద్ధం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాలను సంబంధిత అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలో చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలకు సంబంధించిన అంశాలపై ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులతో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏడాదిలో కనీసం వంద రోజులు ఉపాధి పనులు చూపాలన్నారు. పని కోరిన 15 రోజుల్లో పనిని పొందే హక్కు కల్పించాలన్నారు. ఇంటికి ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే రోజు కూలికి అదనంగా 10 శాతం వేతనం ఇవ్వాలని తెలిపారు. పని ప్రదేశాల్లో వేతన జీవులు మరణించినా, లేదా పూర్తి అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబానికి నష్టపరిహారం అందించాలన్నారు. ఆగస్టు 23న ఏలూరు జిల్లాలో ఒకే రోజున నిర్వహించిన గ్రామసభల్లో తీర్మానించిన పనులన్నింటినీ పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో మరింత పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం పెంచేందుకు పనులను అందరూ కలిసి పండుగ వాతావరణంలో భూమిపూజ చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలకు కనిపించేలా 2024-25 సంవత్సరంలో చేపట్టబోయే పనులు, పూర్తిచేసిన పనులు వివరాలు తెలిపే సిటిజన్ నాలెడ్జ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టే పనులు పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిపిఒ కె.అనురాధ, డ్వామా పీడీ కె.వెంకట సుబ్బారావు, డిఎల్‌డిఒలు, డిఎల్‌పిఒలు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

వంద రోజుల్లో నిర్దేశించిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

జిల్లాలో వంద రోజుల్లో నిర్దేశించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు కచ్చితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలో ఇళ్ల నిర్మాణాల వంద రోజుల యాక్షన్ ప్లాన్ ప్రగతిపై కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రోజుకు కనీసం 54 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలనా్రు. ఎన్‌టిఆర్ రూరల్ హౌసింగ్‌కు సంబంధించి ఆయా ఇళ్ల పరిశీలన వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో జిల్లాను ముందంజలో ఉంచాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో నాణ్యమైన సేవలందించాలి

'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహనా కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా మహిళాశిశుసంక్షేమ శాఖాధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో పీడీ కె.పద్మావతి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా ప్రత్యేక ప్రణాళిక వేసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 14 నుండి 20వ తేదీలోపు అన్ని కేంద్రాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. ఆహార తయారీలో ప్రమాణాలు పాటించాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు కూటమి కసరత్తు

ఉమ్మడి పశ్చిమగోదావరి కూటమి నేతల సమావేశం

అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ వైపు మొగ్గు

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు సిటీ

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలపై టిడిపి కూటమి కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా బుధవారం ఏలూరులోని ఓ హోటల్లో కూటమి నేతలంతా సమావేశమై చర్చలు జరిపారు. ముఖ్యఅతిథిగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ వైపు నేతలు మొగ్గు చూపినట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన అధిష్టానం నుంచి రావాల్సి ఉందని నేతలు చెబుతున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకునేలా పని చేయాలన్నారు. ఓటు హక్కు ఎలా నమోదు చేయించుకోవాలి, కూటమి నేతలు ఎలా కలిసి పని చేయాలి, ఎన్నికలకు ఎలా సిద్ధం కావాలి అనేదానిపై చర్చించుకున్నామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ఉండబట్టే వరదల సమయంలో ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. యువత ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకునేలా కూటమి నేతలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎంఎల్ఎలు, నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుండెపోటుతో విఆర్ఒ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని పేయ్యేరు శివారు అప్పారావుపేటలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అప్పారావుపేటకు చెందిన విఆర్ఒ సిహెచ్.నాగనాంచారయ్య కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం కంచడం గ్రామంలో విఆర్ఒగా పని చేస్తున్నారు. ఉదయం ఇంటి వద్ద ఉండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి ఇంటి వద్దే మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విఆర్ఒ అకాల మృతితో అప్పారావుపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంలోని పలువురు విఆర్ఒలు నాగ నాంచారయ్య మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్-2024) బుధవారం ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 167 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 160 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఏలూరులో వైసిపి జిల్లా కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిఎన్ఆర్

ఏలూరు గన్ బజారులోని సిఎస్ఐ చర్చి దగ్గర వైసిపి జిల్లా కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, జిల్లా పార్లమెంట్ ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, నూజివీడు ఇన్‌ఛార్జి మేకా వెంకటప్రతాపఅప్పారావు, ఉంగుటూరు ఇన్‌ఛార్జి పుప్పాల వాసుబాబు, చింతలపూడి ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, పోలవరం ఇన్‌ఛార్జి తెల్లం బాలరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. తొలుత కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో జగన్ తనకు అప్పగించిన ఈ జిల్లా అధ్యక్షుని బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిటు, జెడ్‌పిటిసి సభ్యులు, వైస్ ఎంపిపిలు, పార్టీ మండలాధ్యక్షులు, ఎఎంసి మాజీ ఛైర్మన్లు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి కృషి చేయాలి : మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్

నగర అభివృద్ధితో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఏలూరు నగరపాలక సంస్థలో ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు తమ వ్యక్తిగత కారణాలవల్ల పదవికి ఇటీవల రాజీనామా చేశారు. వారి స్థానంలో అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ ప్రకటన ప్రకారం ముగ్గురు అభ్యర్థులు వారి అర్హతను ప్రకటిస్తూ దరఖాస్తులు చేసుకున్నారు. దీనిపై బుధవారం ఏలూరు నగరపాలక సంస్థలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన కార్పొరేషన్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ కొల్లేపల్లి రాజు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, మాజీ కార్పొరేటర్ సుమతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూర్జహాన్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులను మేయర్ పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రేష్టన్వితకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - మండవల్లి



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నాలుగేళ్ల బాలిక శ్రేష్టన్వితకు చోటు దక్కింది. మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన బుంగ ప్రమీల పవన్‌కుమార్‌ల కుమార్తె శ్రేష్టన్విత ఇంగ్లీష్ అక్షరాలను వాటి సంఖ్య క్రమం వరుసలో అత్యంత వేగంగా 13 సెకండ్ల 17 మిల్లీ సెకండ్ల పఠించిన ఏకైక చిన్నారిగా గుర్తింపు పొందింది. దీంతో తల్లిదండ్రులతోపాటు పలువురు చిన్నారిని అభినందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ శ్రేష్టన్విత చిన్నతనం నుంచి తన ప్రతిభను ఘనపరుస్తూనే వస్తుందన్నారు. ఈ చిన్నారి ప్రస్తుతం కైకలూరులో ఒక ప్రయివేట్ పాఠశాలలో యూకేజీ చదువుతూ పాఠశాలలు నిర్వహించే ప్రతి ప్రోగ్రాంలో ఎంతో చురుగ్గా పాల్గొంటుందన్నారు. నృత్యం, గానం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు వంటి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తనదైన నైపులను ప్రదర్శిస్తూ వస్తుందన్నారు. చదువులో కూడా అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ తన తోటి వారికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు పలు ఉద్యోగాలు నిర్వహిస్తున్నప్పటికీ శ్రేష్టన్వితతో కొంత సమయాన్ని కేటాయించి గడుపుతూ ఆటలు, పాటల రూపంలో కొత్త విషయాలను నేర్పిస్తూ వస్తున్నారన్నారు. అయితే ఈ చిన్నారి ఇప్పటికే తెలుగు గుణింతాలు దేశంలో ఉన్న రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లను చక్కగా మాట్లాడుతూ అందరినీ అబ్బుర పరుస్తుందన్నారు. అంతేకాకుండా ఆపద సమయంలో ఫోన్ చేయాల్సిన నెంబర్లు చెప్పిన విధానం వీడియో పలువురిని ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. శ్రేష్టన్విత భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధించి తల్లిదండ్రులకు దేశానికి మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించాలి

మండల ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి రైతులు ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని నూజివీడు మండల ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ అన్నారు. నూజివీడు మండలంలోని మామిడి తోటల్లో అధికంగా సూక్ష్మదాతు లోపం కనిపిస్తుందని, దానిని నివారించడానికి మల్టీకే పది గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి, బోరాన్ రెండు గ్రాములు, జింక్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి, వేప నూనె 1500 పిపిఎంను మూడు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి మొత్తం పిచికారీ చేయాలని సూచించారు. ఇలా చేస్తే పూత రాలడం, పురుగు నివారణ చేయవచ్చన్నారు. దీంతో మామిడికి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ఉద్యాన శాఖలో ఏఏ పంటలు ఉంటాయి?

అధికారి : ఉద్యాన శాఖ పరిధిలో పండ్లు, పూలు, కూరగాయలు, కొబ్బరి, పామాయిల్, కోకో, తదితర పంటలు ఉంటాయి.

ప్రశ్న : నూజివీడు మండలంలో ఉద్యాన తోటల విస్తరణ ఎంత?

అధికారి : మండలంలో మామిడి 19,900 ఎకరాలు, పామాయిల్ 10,543 ఎకరాలు, కొబ్బరి 630, జామ 543, కోకో 230 ఎకరాలు సాగులో ఉన్నాయి.

ప్రశ్న : పండ్ల తోటలకు విస్తరణ పథకం రాయితీలు ఉన్నాయా? ఉంటే ఎంతెంత?

అధికారి : పండ్ల తోటలకు మూడేళ్ల పాటు నిర్వాహణ ఖర్చు 50 శాతం ఇస్తాం.

ప్రశ్న : ఉద్యాన శాఖ రైతులకు యాంత్రికరణాలు ఇస్తున్నారా? ఇస్తే ఎంత శాతం రాయితీ ఇస్తున్నారు?

అధికారి : ఉద్యాన శాఖలో యాంత్రికరణాలు 50 శాతం రాయితీతో ఇస్తున్నాం. అవి తైవాన్ స్ప్రే, పవర్ టిల్లర్, మినీ ట్రాక్టర్ ఇస్తున్నాం.

ప్రశ్న : కూరగాయల తోటలకు ఏమైనా రాయితీలు ఉన్నాయా? ఉంటే ఎంత శాతం రాయితీ ఉంది?

అధికారి : కూరగాయల తోటలకు శాశ్వత పందిళ్ల కింద 50 శాతం రాయితీ ఉంది. ఎకరాకు రూ.లక్ష ఇస్తున్నాం. కూరగాయల తోటల్లో కలుపు నివారించడానికి మల్చింగ్ షీట్స్‌కు ఎకరాకు రూ.6,400 రాయితీ కల్పిస్తున్నాం.

ప్రశ్న : మామిడి ప్రాసెసింగ్ యూనిట్ పనులు ఎంతవరకు వచ్చాయి?

అధికారి : మండలంలోని నర్సాపేటలో 35 ఎకరాలు భూ కేటాయింపు జరిగింది. కాని నిధుల కొరత వల్ల నిర్మాణం కాలేదు. త్వరలో నిర్మాణం ప్రారంభిస్తాం.

ప్రశ్న : కొబ్బరి తోటలకు, పామాయిల్ తోటలకు నిర్వహణ ఖర్చు ఏమైనా ఇస్తారా?

అధికారి : మొక్కలకు, ఎరువులకు, నిర్వహణకు 50 శాతం రాయితీ ఇస్తాం. పామాయిల్‌లో అంతర్ పంట వేసుకున్న రైతులకు కూడా రాయితీ కల్పిస్తున్నాం.

ప్రశ్న : ఉద్యాన శాఖలో ఉన్న పథకాల గురించి, రాయితీల గురించి రైతులకు ఏవిధంగా కల్పిస్తున్నారు?

అధికారి : ఉద్యాన శాఖలో ఉన్న ప్రతి ప్రభుత్వ పథకాన్ని రైతుకు రైతు సేవా కేంద్రం ద్వారా, ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

ఆటోల్లో నుంచి ప్రయాణికులను దించేస్తున్నా పట్టించుకోరా

పోలీసుల తీరుకు సిఐటియు జిల్లా కమిటీ ఖండన

ఏలూరు అర్బన్ : ఏలూరు నుండి తిరిగి వెళ్లే అప్పనవీడు స్టాండ్ ఆటోలను వట్లూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద అడ్డగించి ప్రయాణికులను దించేస్తున్న ఏలూరులోని ఒక ఆటో యూనియన్ నాయకులు నగరబోయిన లీలాకృష్ణ, అతని అనుచరు లపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి. ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 20 రోజులుగా అప్పన వీడు నుండి ఏలూరు వచ్చి తిరిగెళ్లే ఆటో డ్రైవర్లను అడ్డగించి దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు త్రీటౌన్ సిఐకి, ఏలూరు డిఎస్‌పికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పనవీడు ఆటో డ్రైవర్లు సిఐటియుని వదిలి తమ యూనియన్‌లో చేరాలని, లేని పక్షంలో మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. లీలాకృష్ణ, అతని అనుచరులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో పోలీసు అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని, బలవంతంగా ఆటోలు అడ్డగిం చడం వలన లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈ విషయాలను జిల్లా ఎస్‌పి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, సమస్య పరిష్కారం కానిపక్షంలో నగరంలోని ఆటో డ్రైవర్లందరినీ సమీకరించి ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్నేహపూర్వక వాతావరణంలోనే వాస్తవికాభివృద్ధి

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్నేహపూర్వక వాతావరణంలో మాత్రమే ఏలూరు వాస్తవికాభివృద్ధి సాధ్యమని ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఆ దిశగా సమర్థవంతమైన పాలనకు మరింత ప్రేరణ కలిగించేలా సమిష్టి చర్యలకు శ్రీకారం చుట్టనని స్పష్టం చేశారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎంఎల్‌ఎగా అధికారం చేపట్టిన తర్వాత ఏలూరు నగర పాలక సంస్థలో నూతనంగా చేపట్టిన పరిపాలనా పరమైన మార్పులపై స్పష్టతనిచ్చారు. అనుభవానికి పట్టం కట్టాలని ఆలోచనతోనే గతంలో ఉన్న పాలకవర్గంలోని కో-ఆప్షన్ సభ్యుల స్థానంలో టిడిపికి చెందిన ముగ్గురికి ఆ పదవులు కేటాయించామన్నారు. అనంతరం పాలకవర్గం సమావేశంలో వారు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారికి అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో తనదైన పాలనతో ఏలూరును మరింత అభివృద్ధి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, టిడిపి నగరాధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, కొల్లేపల్లి రాజు, జాలా సుమతి, ఎస్‌ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో పని చేస్తున్న పలువురు రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యారు. నూతనంగా వచ్చిన అధికారులు బాధ్యతలు చేపట్టారు. ముదినేపల్లి ఆర్ఐ పి.శివకుమార్ బదిలీపై గుడ్లవల్లేరు మండల రెవెన్యూ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో కలిదిండి రెవెన్యూ కార్యాలయం నుంచి ఎస్.శామ్యూల్ బదిలీపై ముదినేపల్లి వచ్చారు. ముదినేపల్లి-1 విఆర్‌ఒగా కరీం కోడూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలోకి పెనుమల్లి విఆర్ఒ బేవ వెంకట హనుమంతరావు వచ్చారు. అల్లూరు విఆర్ఒ పద్మావతి వడాలికి, ఇక్కడ పని చేస్తున్న కాగిత మురళి పెనుమల్లికి బదిలీ అయ్యారు. పెదపాలపర్రు నుంచి ఆర్.సుబ్రహ్మణ్యం ముదినేపల్లి-2కు, సింగరాయపాలెం నుంచి పి.వెంకట్రావు పెదగొన్నూరుకు, అక్కడ నుంచి ఏడుకొండలు శ్రీహరిపురానికి, ఇక్కడ నుంచి రామసుబ్బయ్య సింగరాయపాలేనికి బదిలీ అయ్యారు. అదేవిధంగా వైవాక నుంచి ఫణి వాడవల్లికి, చిగురుకోట నుంచి కె.కిషోర్ కొరగుంటపాలేనికి, వాడవల్లి నుంచి ఏసుబాబు చిగురుకోటకు బదిలీ అయ్యారు. వణుదుర్రు విఆర్ఒ నరసింహారావు గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు, గురజ విఆర్ఒ పవన్ నూజివీడు మండలం సీతారామపురానికి బదిలీపై వెళ్లారు.



అధికారులను సత్కరిస్తున్న సర్పంచి మారుతీ ప్రసన్నవెంకటేశ్వరరావు

పలువురికి సర్పంచి మారుతీ ప్రసన్న సత్కారం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక గ్రామ పంచాయతీలోని సచివాలయం-1 విఆర్‌ఒగా దాసరి ప్రసాదరావు, సర్వేయర్‌గా గుల్ల శ్రీను, సచివాలయం-2 విఆర్‌ఒగా ఈదా అనిల్‌కుమార్, సర్వేయర్‌గా వేములవాడ నాగరాజు సాధారణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వీరిని సర్పంచి మారుతీ ప్రసన్నవెంకటేశ్వరరావు బుధవారం సన్మానించారు. అలాగే గత పదేళ్లుగా విశేష సేవలందించి పోతుమర్రు బదిలీ అయిన గుడిపాటి శ్రీనివాసరావును సర్పంచి ప్రసన్న వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్‌వి.ఉదయ్‌కుమార్, గొట్టుముక్కల సత్యనారాయణ రాజు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించటంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర కూడా ఎంతో కీలకమని ఎంపిడిఒ బి.భార్గవి అన్నారు. ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ అబ్దుల్ సలాం, ఇఒపిఆర్‌డి ఆనంద్‌బాబు, పలు గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

భీమడోలు :గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో గత రెండు రోజులుగా గ్రామపంచాయతీ ఉపసర్పంచులు, ఎంపిక చేసిన వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు అభియాన్ కార్యక్రమంపై నిర్వహిస్తున్న పునఃశ్చరణ శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపిడిఒ మాట్లాడారు. శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా సూరప్పగూడెం, అంబరుపేట గ్రామపంచాయతీ కార్యదర్శులు ముత్తయ్య, వెంకట్రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి పాల్గొన్నారు.

కామవరపుకోట : ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు పంచాయతీల్లో సాధారణ పరిపాలనపై అవగాహన ఉండాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.సత్యవేణి అన్నారు. పంచాయతీల నిధుల వినియోగం, ఆదాయ వనరులు తదితర అంశాలపై రెండో రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిశాయి.

శిక్షణ తరగతులకు ఆరుగురే హాజరు

చింతలపూడి :గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం చింతలపూడిలో నీరు గారింది. ఎంపిడిఒ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమానికి సుమారు రోజుకు 66 మంది శిక్షణకు హాజరు కావాల్సి ఉండగా రెండో రోజు ఇద్దరు వార్డు మెంబర్లు, నలుగురు సెక్రటరీలు హాజరయ్యారు. కనీసం వారికి శిక్షణ ఇచ్చే వారు కూడా సమావేశంలో లేకపోవటం గమనార్హం. దీనిపై జెడ్‌పి సిఇఒ సుబ్బారావును వివరణ కోరగా శిక్షణా కార్యక్రమని మళ్లీ నిర్వహిస్తామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ముదినేపల్లి :ఓ వివాహితను ప్రేమిస్తున్నానని, నిన్ను పెళ్లి చేసుకుంటానంటూ వేధిస్తున్న యువకుడిపై ముదినేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దేవపూడి గ్రామానికి చెందిన ఓ వివాహితకు అదే గ్రామానికి చెందిన ఉయ్యూరు నాగయ్య(24) అనే యువకుడు తరచూ ఫోన్ చేస్తూ నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని, నీ భర్తకు విడాకులు ఇచ్చేయ్ అంటూ వేధిస్తున్నట్లు తెలిపారు. సదరు మహిళను వేధిస్తున్న వ్యక్తి భర్తకు స్నేహితుడు కావడంతో భర్త ఇంటి వద్ద లేని సమయంలో నాగయ్య ఇంటి వద్దకు వచ్చి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయం సదరు మహిళ భర్త సురేష్‌కు చెప్పింది. దీంతో భార్యాభర్తలు ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ వచ్చి ఉయ్యూరు నాగయ్యపై ఫిర్యాదు చేశారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడికి జైలు, జరిమానా

ఏలూరు స్పోర్ట్స్ :ఒంటరిగా ఉన్న మహిళపై దాడికి పాల్పడి ఆమె వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటనలో నిందితుడు పసుపులేటి అజయ్‌కుమార్‌కు తొమ్మిది నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ ప్రాంతానికి చెందిన పామర్తి వరలక్ష్మి భర్తతో కలిసి జీవిస్తుంది. ఈ క్రమంలో 2014 నవంబర్ 23 తేదీన గుర్తుతెలియని వ్యక్తి వరలక్ష్మి ఇంటికి వెళ్లి మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చానని, ఆధార్ కార్డుల జిరాక్సుల వివరాలను నమోదు చేస్తానని నమ్మ బలికాడు. తదుపరి రోజు నవంబర్ 24వ తేదీన మళ్లీ వరలక్ష్మి ఇంటికి వెళ్లి జిరాక్స్ తీశారా లేదా అన్న అంశంపై ఆరా తీసి ఆమె ఒంటరిగా ఉందన్న విషయం గమనించి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ఆమె వద్ద ఉన్న పర్సును దొంగిలించుకుని పారిపోయాడు. విచారణలో అతని పేరు పసుపులేటి అజయ్‌కుమార్ అలియాస్ అరుణశాస్త్రి నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. ఈ ఘటనపై అదేరోజు వరలక్ష్మి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం పూర్తి వాదోపవాదాలు విన్న తర్వాత ఈ కేసు న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. అతని ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని నేరాన్ని ఒప్పుకోలు కారణంతో అతనికి తొమ్మిది నెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఇసుక కొరతతో తీరని అవస్థలు

పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులు

గృహాలు పూర్తవ్వక ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలంలో ఇసుక కొరతతో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారుగా పది వేల మంది భవన నిర్మాణ కార్మికులకు సరైన ఉపాధి దొరకడంలేదు. 18 రకాల అనుబంధ రంగాలకు చెందిన కార్మికులకు కూడా పనులు తగ్గాయి. వారి కుటుంబం గడవడం కష్టతరంగా మారింది. ఇసుక ధరలు విపరీతంగా పెరగడంతో పని దొరకక రోజు పని కోసం కొమ్మది లేబర్ బజారుకు వచ్చే కార్మికులు నిరాశాభావంతో ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. నెల రోజుల నుంచి భవన నిర్మాణ కార్మికులకు పనులు ఉండడంలేదు.

చింతలపూడి మండలంలో ఇసుక పాయింట్ లేకపోవడంతో, ఇబ్రహీంపట్నం ఇసుక పాయింట్ ఏర్పాటు చేయడంతో ఇటు రవాణా సౌకర్యం ఇబ్బందిగా ఉందని, రోడ్లు సరిగా లేక, కిరాయిలు ఎక్కువగా చెబుతున్నారని, దీంతో సామాన్యులు ఇల్లు కట్టుకోవడం, నిలిపివేశారని, దీంతో పాటు లేక నాన ఇబ్బందులు పడుతున్నామని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందో ఎప్పుడు పూర్తవుతుందో తెలియక గృహ నిర్మాణ యజమానులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇసుక టన్ను రూ.1200 పడుతుందని, ఆన్‌లైన్ చేయటం కోసం ఆన్‌లైన్ కంప్యూటర్ వద్ద పడిగాపులు పడుతున్నామని, పది నిమిషాల్లో ఆన్‌లైన్ సైట్ క్లోజ్ అవుతుందని, దీంతో ఇబ్బందులు తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక బుక్ చేసిన తర్వాత రిజెక్ట్ అవుతుందని, దీంతో మండలంలో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని, పనిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు వాపోతున్నారు.

ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించాలని, ఎవరి ప్రమేయం ఉండకూడదని, ఆదేశాలు ఇచ్చినప్పటికీ కింది స్థాయిలో అది జరగడం లేదని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేయడానికి అవకాశం ఉండటం లేదని, వాగులు, కాలువల్లో దొరికే ఇసుకతో గృహ నిర్మాణం చేపట్టడానికి చూస్తుంటే, ఆ ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుంటే, ఆ మాత్రం పనులు కూడా దొరకని లేదని, గృహాలు కట్టుకోవడానికి తీసుకెళ్తున్నామని చూపించినా పోలీసులు వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి

ఇటు తమ్మిలేరు ప్రాజెక్ట్, చుట్టుపక్కల కాలువలు, శివపురం వద్ద ఇసుక దొరుకుతుందన్నారు. చింతలపూడిలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఆసుపత్రి నిర్మాణంలో నాసిరకం ఇసుక

వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణంలో నాసిరకం ఇసుక వాడుతున్న చింతలపూడి ఎంఎల్‌ఎ హెచ్చరించినా తీరు మారలేదు. వంద పడకల ఆసుపత్రి పనుల్లో నాణ్యత లోపిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో, వాగుల్లో ఉన్న నాసిరకం ఇసుకను తీసుకొచ్చి ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. ఈ ఇసుకను వాడొద్దంటూ ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది హెచ్చరించినా బేఖాతారు చేస్తూ గుత్తేదారులు పనులు చేపడుతున్నారు. గుత్తేదారు నాణ్యత లేని నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నాసిరకం పనులు అడ్డుకోవాలని జిల్లా ఉన్నత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

సమాచార హక్కు చట్టాన్ని అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ చట్టం లక్ష్యం నెరవేరడం లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు విమర్శించారు. ఈ నెల 12వ తేదీన ఆర్‌టిఐ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయం వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. అధికారుల్లో పేరుకుపోయిన నిర్లక్ష్యం వల్ల సమాచార హక్కు చట్టం అమలు కాకపోవడం వల్ల సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదన్నారు. సమాచార హక్కు చట్టానికి ఆత్మలాంటి సెక్షన్ 4(1) బిని17 అంశాలతో కూడిన సమాచారాన్ని కార్యాలయాలలో ప్రజల ముందు ఉంచడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పౌర సమాచార అధికారులు రికార్డులను క్రమబద్ధీకరించి వివిధ తరగతులుగా విభజించి సెక్షన్ 4(1) బిని తెలుగులో సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగడవరం ఇఒగా వసంతవాణిప్రసాద్ బాధ్యతలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రగడవరం పంచాయతీ ఇఒగా వసంతవాణి ప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వీరవాసరం మండలం నౌడూరు పంచాయతీ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ప్రభుత్వాసుపత్రిలో మహిళ ఆందోళన

ఏలూరు స్పోర్ట్స్ :కడుపునొప్పితో ఉన్న ఒక మహిళ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకుంటే అది కాస్త ఇన్‌ఫెక్షన్ అయింది. భయంతో ఆపరేషన్ చేసిన వైద్యుని వద్దకు వెళ్లి అడిగితే అలానే ఉంటుందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారంటూ బాధితురాలితో పాటు ఆమె కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులకు ఆ వైద్యునిపై ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన మలపరెడ్డి ఉమాభారతి ఈ ఏడాది జులై 24న ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సర్జికల్ విభాగంలో చూపించుకోగా అక్కడ ఉన్న వైద్యులు దుర్గాప్రసాద్ ఆపరేషన్ చేయాలని సూచించారు. వెంటనే ఆసుపత్రిలో చేరారు. అదే నెల 27వ తేదీన ఆపరేషన్ చేశారు. ఆగస్టు ఐదో తేదీన డిశ్చార్జి అయ్యారు. ఆపరేషన్ చేసిన చోట పుండు మానకపోవడంతో అనేకమార్లు ఆ వైద్యుని సంప్రదించగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం ప్రభుత్వాసుపత్రికి పెద్దల సమక్షంలో డాక్టర్ దుర్గాప్రసాద్‌ను ప్రశ్నించారు. అప్పటికి కూడా ఆయన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆసుపత్రిలో చేరాలని, వేరే వైద్యులతో వైద్యం చేస్తామని చెప్పారు. ఆ వైద్యునిపై చర్యలు తీసుకోవాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

జీలుగుమిల్లి :మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బర్రింకలపాడుకు ఆర్‌డిఎస్ స్కీం ద్వారా ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు బుధవారం ప్రారంభించారు ఎలక్ట్రికల్ డిఇ రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బాలరాజు మాట్లాడుతూ ఈ విద్యుత్ లైన్ వల్ల బర్రింకలపాడు చుట్టూపక్కల గ్రామాలతో పాటు గిరిజన గురుకుల కళాశాల, పాఠశాలకు కూడా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు.

భీమడోలులో సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

ట్రాఫిక్ నియమ, నిబంధనలకు అనుగుణంగా ఆటోలను నిర్వహిస్తూ అటు అధికారులతో పాటు, ఇటు ప్రయాణికుల మన్ననలు పొందుతున్న భీమడోలు శ్రీ వెంకటేశ్వర ఆటో ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సామాజిక భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని భీమడోలు గ్రామపంచాయతీ యాజమాన్యం కేటాయించగా, సంఘం ఆధ్వర్యంలో సభ్యులు ఇతరుల సహాయ సహకారాలు సుమారు రూ.పది లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం ప్రారంభించారు. భవనంలోని కొన్ని విభాగాలను మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు ప్రారంభించగా, శిలాఫలకాన్ని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఆవిష్కరించారు. ఆటో డ్రైవర్ల అవగాహన కోసం ట్రాఫిక్ సిగ్నల్స్‌తో కూడిన ఫ్లెక్సీని ఎంఎల్‌ఎ, భీమడోలు సిఐ విల్సన్‌తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమానికి సంఘ గౌరవాధ్యక్షులు బాదర్వాడ కృష్ణమోహన్‌రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు చీర్ల సాంబశివరావు మాట్లాడుతూ సంఘ సభ్యులు మధ్యతరగతికి చెందిన వారన్నారు. వీరు తమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకమైన వసతి అవసరం ఏర్పడిందన్నారు. దీని దృష్టిలో ఉంచుకొని సభ్యుల సహకారంతో సామాజిక భవనాన్ని నిర్మించామన్నారు. ఇక్కడే సభ్యులు తమ కుటుంబ సభ్యులతో ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాల్సి ఉందన్నారు. దీనికోసం మాజీ ఎంఎల్‌ఎ, ప్రస్తుత ఎంఎల్‌ఎ చొరవ తీసుకొని మరొక రూ.పది లక్షలు పార్లమెంట్ సభ్యుల నిధుల మంజూరుకు సహకరించాలని కోరారు. వీటితో భవనానికి స్లాబ్ నిర్మాణంతో పాటు, భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతామన్నారు. ఇదే క్రమంలో పోలసానిపల్లి రోడ్డులో ఆటో స్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మాజీ ఎంఎల్‌ఎ ఈ మేరకు నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు యోహాన్ పాల్గొన్నారు. వీరితో పాటు రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని సామాజిక భవనాన్ని నిర్మించిన సంఘ సభ్యులను అభినందించారు.

తపాలా శాఖ సేవలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

తపాలా శాఖ సేవలు పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కోరారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ తపాలా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త సుధాకర్ మాట్లాడుతూ తపాలా శాఖ కేవలం ఉత్తరాలు పంపడానికి మాత్రమే పనికి వస్తుందన్న అపోహను వీడాలని కోరారు. సాంకేతిక విజ్ఞానం పెరిగిన నేపథ్యంలో కాలక్రమేనా ఉత్తరాలను పంపే వ్యవస్థ తగ్గిందన్నారు. కాని తపాలా శాఖ ద్వారా అమలయ్యే పలు బీమా, పొదుపు పథకాలు ఇప్పటికీ ఆదరణను కోల్పోలేదన్నారు. బ్యాంకులకు దీటుగా సదరు వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. దీంతో పాటు పలు ఆర్థిక భరోసా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో పుస్తక పఠనం పట్ల ఆసక్తిగల విద్యార్థులు తమ చేతిరాతను మెరుగుపరుచుకునేందుకు పోస్ట్‌కార్డు రాయటం ఒక అలవాటుగా పెట్టుకోవాలని సూచించారు. దూర ప్రాంతాల్లో గల బంధువులు ఇతరులకు ఈ తరహా లేఖలను రాయటం ద్వారా వారితో సత్సంబంధాలు కొనసాగించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

బాధితుల తరపున డిఐజికి ఎంఎల్‌ఎ చింతమనేని వినతి

ఏలూరు స్పోర్ట్స్ :బాలుడు బాలికను గర్భవతిని చేయగా దీనిపై దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్‌ఐ స్పందించలేదని, ఎస్‌ఐపై చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఏలూరు రేంజ్ డిఐజి ఐజి అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వివరాల ప్రకారం... దెందులూరు మండలానికి చెందిన ఓ బాలిక స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతుంది. అదే మండలంలోని మల్లసానికుంట గ్రామానికి చెందిన బాలుడు బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి ఐదు నెలలుగా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం బాలిక గర్భం దాల్చింది. గత నెల 14వ తేదీన బాలిక తల్లిదండ్రులు దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేసి బాలుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయినప్పటికీ దెందులూరు ఎస్‌ఐ ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తూ వచ్చారని, ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ బాధితురాలని, బాలిక కుటుంబ సభ్యులను ఏలూరు రేంజ్ డిఐజి కెవి.మోహన్‌రావు కార్యాలయానికి తీసుకెళ్లి వినతి పత్రాన్ని అందించారు. దెందులూరు పోలీసులుపై కూడా చర్యలు తీసుకోవాలని, బాలికకు మెరుగైన వైద్యం అందించాలని డిఐజిని కోరారు.

కన్నాపురానికి ఫ్రీజర్ బాక్స్ అందజేత

కొయ్యలగూడెం :మండలంలోని కన్నాపురంలో మరణించిన వారిని భద్రపరచడానికి ఫ్రీజర్ బాక్స్ లేక, ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవడానికి డబ్బులు లేక, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఈడ్పుగంటి మనోహర్ చౌదరి, తనకు తెలిసిన ఇంటర్నేషనల్ కమ్మ సంఘం ఫౌండేషన్ ఛైర్మన్ సహాయంతో కన్నాపురం గ్రామానికి ఫ్రీజర్ బాక్స్‌ను తెప్పించారు. ఈ బాక్స్‌ను గ్రామానికి ఉచితంగా అందించడానికి విజయవాడ పవన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మైనేని సాయిబాబు ముందుకు వచ్చారు. ఈ సహాయానికి కన్నాపురం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పుల్లగుల్ల మధు చౌదరి (ఇంటర్నేషనల్ కమ్మ సంఘం, పెళ్లి పిలుపుల సేవా సంఘం ఫౌండేషన్ ఛైర్మన్) మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం ఇతర దేశాలు, ప్రాంతాలకు వెళ్లిన వారు, తమ స్వగ్రామమైన కన్నాపురం చుట్టుపక్కల గ్రామాల్లోవారు మరణిస్తే, చూడటానికి రెండు మూడు రోజుల సమయం పడుతుందని, అంతవరకు మృతదేహాన్ని భద్రపరచడానికి ఫ్రీజర్ బాక్స్ లేకపోవడంతో ఈడ్పుగంటి మనోహర్ చౌదరి ద్వారా ఈ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇకపై ఎవరికైనా ఫ్రీజర్ బాక్స్ అవసరమైతే ఈడ్పుగంటి మనోహర్ చౌదరిని 8096152802 సంప్రదిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నాపురం గ్రామ సర్పంచి ఉప్పల పద్మావతి, ఉప సర్పంచి మొహమ్మద్ ముంతాజ్ బేగం, ఎంపిటిసి సభ్యులు షేక్ బాజీ, కాగితల గణపతి, టిడిపి టౌన్ అధ్యక్షులు బొమ్మ వెంకట రామ గంట్లయ్య, జనసేన ప్రెసిడెంట్ భోగిశెట్టి రాఘవ, పంచాయతీ సెక్రటరీ రవికుమార్, గ్రామ పెద్దలు, నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పొందాలి

పలుచోట్ల 'పొలం పిలుస్తొంది'

ప్రజాశక్తి - కామవరపుకోట

రైతులు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. మండలంలోని తడికలపూడి, కెఎస్.రామవరం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తొంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేవారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్, వెటర్నరీ అధికారి ఆదిత్య, రైతులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని పోతురెడ్డిపల్లి, తుక్కులూరు గ్రామాల్లో పంటలను ఆర్‌డిఒ ఎం.వాణి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2024 సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలను ఇ-పంట ద్వారా నమోదు చేసిన రికార్డులను పరిశీలించి సర్వే నెంబర్ వారీగా పంటలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ ఇ-పంటలో ప్రతి రైతూ ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పాత రవిచర్ల, ముక్కోళ్లపాడులో పొలం పిలుస్తొంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ, అనుబంధ సంస్థలు కలిసి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

ముసునూరు : ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై స్ప్రింకర్లు, డ్రిప్పులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ముసునూరు మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోపవరం, లోపూడి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మధుమోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, సర్పంచి పేరం కృష్ణ, టిడిపి బాసవరపాడు నాయకులు వేంపాటి శ్రీనివాసరావు, లక్క పాము కాంతారావు, రైతులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం :మండలంలోని జైనవారిగూడెం, విప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో వరి పంటలో తెగుళ్ల ఆశించినట్లు గుర్తించారు. అనంతరం స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జైనవారిగూడెం గ్రామ సర్పంచి తాటి సీత, గ్రామ వ్యవసాయ సహాయకులు, పోలవరం మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్, ప్రకృతి సేద్య సిబ్బంది, గ్రామ రైతులు కోవాసి రాముడు, ఏనుగుల శ్రీనివాస్, ఉడా నాగరాజు, తెల్లం దుర్గారావు, తాటి ముక్కయ్య, రైతులు పాల్గొన్నారు.

చాట్రాయి :రైతులు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని వ్యవసాయ శాఖాధికారి బి.శివశంకర్ తెలిపారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో పొలం పిలుస్తొంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులతో మాట్లాడారు. సేంద్రీయ ఎరువులు, మాగిన ఎరువులు, వేప, కోడిగుడ్ల ద్రావణం, నీమాస్త్రం ,జీవామృతం వాడాలని, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని, అవసరాన్ని బట్టి పురుగుమందులు వాడాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రమణక్కపేట విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఆటలకు ఎంపికవ్వడం ఆనందదాయకమని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్ బాల్ ఆటల్లో ప్రతిభ కనబర్చిన తమ విద్యార్థులు టి.నాగసుధ, జి జెసి, డి.ఇందుప్రియ ఈ నెల 10, 11, 12 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి ఆటల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు తెలిపారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. గ్రామస్తులందరూ ఆ ముగ్గురు విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

జెఎసి నాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2022 ఆగస్టులో సిపిఎస్ ఉద్యమంలో పాల్గొన్న జెఎసి నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని జెఎసి జిల్లా ఛైర్మన్, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు కోరారు. బుధవారం జెఎసి ఆధ్వర్యంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాడినందుకు గత ప్రభుత్వం అనేక మందిపై అక్రమ కేసులు పెట్టిందని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌పి స్పందిస్తూ కలెక్టర్‌కు ఫైల్ పెట్టి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకుంటామని జెఎసి నాయకులకు హామీ ఇచ్చారు. అదే విధంగా కొయ్యలగూడెంలో లిటరసీ రిక్రియేషన్ సెంటర్‌కి 13 సెంట్ల భూమి ఉందని, సదరు భూమిని కొంతమంది ఆక్రమించి సంఘ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎస్‌పికి వివరించారు. అక్రమార్కులపై కేసు పెట్టి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హామీ ఇచ్చారు. పిఆర్‌టియు అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఎపిటిఎఫ్ అధ్యక్షుడు గగులోతు కృష్ణ, డిటిఎఫ్ అధ్యక్షుడు ఆదినారాయణ పాల్గొన్నారు.

మద్యం షాపులకు 3,814 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతన మద్యం షాపులకు బుధవారం సాయంత్రానికి జిల్లావ్యాప్తంగా 3,814 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తెలిపారు. ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు శుక్రవారం సాయంత్రం వరకు ప్రభుత్వం పొడిగిం చడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏలూరు స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 301 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

నూజివీడు టౌన్ :నూతన మద్యం షాపుల కోసం నూజివీడు డివిజన్ పరిధిలో 474 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. చాట్రాయి మండలంలో రెండు మద్యం దుకాణాలకు 75 దరఖాస్తులు, ముసునూరు మండలంలోని మూడు మద్యం దుకాణాలకు 103, ఆగిరిపల్లి మండలంలోని నాలుగు మద్యం దుకాణాలకు 120, నూజివీడు రూరల్‌లోని నాలుగు మద్యం దుకాణాలకు 67, నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోని మూడు మద్యం దుకాణాలకు 109 దరఖాస్తులు వచ్చాయని మొత్తం 474 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

చెడుపై మంచి సాధించిన విజయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఆయుధ పూజలు చేస్తారని ముదినేపల్లి స్వామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ అన్నారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం ఐటిఐలో ఆయుధ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లోకి విజయవర్ధిని

ప్రజాశక్తి - కామవరపుకోట

మండల నీటి పారుదల, పారిశుధ్యం, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ విభాగం మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా కొత్తూరి విజయవర్ధిని విధుల్లో చేరారు. గత ప్రభుత్వం వీరిని విధుల్లో నుంచి తొలగించగా కోర్టు తీర్పు మేరకు ప్రస్తుత ప్రభుత్వం వీరిని విధుల్లోకి తీసుకుంది.

ఎంపిడిఒకు సర్పంచుల ఛాంబర్ సభ్యుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన కె.కిరణ్‌కుమార్‌కు సర్పంచుల ఛాంబర్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల ఛాంబర్ సభ్యులు ఎంపిడిఒను శాలువాతో సత్కరించారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో తన వంతు కృషి చేస్తానని ఎంపిడిఒ కిరణ్‌కుమార్ చెప్పారు.

బహిరంగ ప్రకటన

ఇందుకు సంబంధించిన వారందరికి నా క్లయింట్ **సిఎజి ఇండస్ట్రీస్,** ప్లాట్‌నెం.ఎ1, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, ఆం.ప్ర. వారి సూచనలు క్రింద తెలియజేయునది ఏమనగా.

డిస్‌సొల్యూషన్ డీడ్ **తేది.30.09.2024** ప్రకారం పరస్పర సమ్మతి ద్వారా దీని భాగస్వాములను అందరిని అనగా **1) యన్నమని బుల్లి శ్రీనివాస్, యన్నమని సరోజ రాణి** రద్దు చేసారు మరియు **యన్నమని బుల్లి శ్రీనివాస్ ది.30.09.2024 కు** ముందు సదరు రద్దు చేయబడిన భాగస్వామ్య సంస్థ సిఎజి ఇండస్ట్రీస్ యొక్క మూసివేసిన వ్యాపారానికి అవసరమైన చర్యలన్నింటికి చేయడానికి మరియు వ్యవహారాలు చేయుటకు అధికారం కలిగి యున్నారు. అందువలన ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది.

తణుకు
తేది : 30.09.2024
జంగం వెంకటేశ్వర రావు
అడ్వకేట్, తణుకు